# కెరటం న్యూస్
( సామాన్యుడి ఆయుధం )

హైదరాబాద్
శుక్రవారం
08-03-2024

వెల రూ.4/-
సంపుటి: 272 సంచిక: 15
పేజీలు: 04

Editor: Vanam Nagaiah


## పదేళ్లు గొర్రెలను చేశారు..



వివరాలు 02లో..

# వారిది సంఘర్షణ..
# మాది సహకారం



అధికారంలోకి రాగానే కేంద్రానికి భూములిచ్చాం..

ప్రతిగా కేంద్రం ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతిచ్చింది..

ఇతర పథకాల కోసం ప్రధాని మోదీకి వినతి..

అల్వాల్‌లో ఎలివేటెడ్ కారిడార్ శంకుస్థాపన లో సీఎం రేవంత్

బాబు జగ్జీవన్‌రామ్ భవనం ప్రారంభం

కెరటం న్యూస్, హైదరాబాద్-మార్చి 7:

**తాము అధికారంలోకి రాగానే** కేంద్రంతో సఖ్యతగా వ్యవహరిస్తూ అనుగుణమైన చర్యలు తీసుకున్నామని దాని వల్లనే కేంద్రం కూడా సహకరించటానికి ముందుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం కేంద్రంతో పెట్టుకున్న ఘర్షణ వల్ల రాష్ట్ర ప్రజానీకం నష్టపోయిందన్నారు. సికింద్రాబాద్‌లోని అల్వాల్ సమీపంలో ప్యారడైజ్-శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ పనులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎలివేటేడ్ కారిడార్ పూర్తయితే కరీంనగర్, ఆదిలాబాద్ ప్రయాణం సులభతరం అవుతుందన్నారు. 40ఏళు ్లగా కుత్బుల్లాపూర్, మేడ్చల్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, మంచిర్యాల ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, గత ప్రభుత్వం కేంద్రంతో అనుసరించిన ఘర్షణ వైఖరి కారణంగా ఈ ప్రాజెక్టు ఆలస్యమైందని తెలిపారు. గత ప్రభుత్వం సరైన సంప్రదింపులు జరపలేదని రక్షణ శాఖ అధికారులు స్వయంగా చెప్పారన్నారు. తాము అధికారంలోకి రాగానే ప్రధాని మోదీని, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను కలిసి ప్రాజెక్టు అవసరాన్ని వివరించి సమస్యను పరిష్కరించామన్నారు. అయితే, తమ పోరాటం వల్లనే ఇది సాధ్యమైందని కేటీఆర్ చెబుతున్నారని.. ట్విటర్‌లో పోస్టులు పెట్టడమే పోరాటమా? మేం అనుమతులు తీసుకొస్తే మిగతా 2లో..

## ఆర్టికల్ 370 రద్దుతో
# ప్రజలకు స్వేచ్ఛ

- జమ్మూకశ్మీర్ హాయిగా ఊపిరి పీల్చుకుంటోంది
- ఈ ఆర్టికల్‌పై కాంగ్రెస్ పార్టీ దేశాన్ని తప్పుదోవ పట్టించింది
- ప్రధాని మోదీ మండిపాటు
- జమ్మూకశ్మీర్‌లో రూ.5,000కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం



కెరటం న్యూస్, శ్రీనగర్-మార్చి7:

ఆర్టికల్ 370 రద్దు తర్వాత అభివృద్ధిలో జమ్మూకశ్మీర్ నూతన శిఖరాలకు చేరుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. అబివృద్ధికి అడ్డుగోడగా మారిన ఈ ఆర్టికల్‌ను రద్దు చేశాక ప్రజలకు మిగతా 2లో..



## సవాల్ విసిరితే దేనికైనా సిద్ధం

- చైనాకు హెచ్చరికలు చేసిన రాజ్‌నాథ్‌సింగ్

2

## లిక్కర్ కేసు పెద్దదేమీ కాదు

- దాన్ని మా లీగల్ టీమ్ చూసుకుంటుంది..
- ఎమ్మెల్సీ కవిత ధీమా

2





## గెలుపే ఏకైక లక్ష్యంగా బీఆర్ఎస్
# ఎన్నికల శంఖారావం

- అబద్ధాల కాంగ్రెస్‌ను ఓడిద్దాం
- నామ గెలిస్తేనే భవిష్యత్
- ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో వక్తల ఉద్ఘాటన

ఖమ్మం బ్యూరో, మార్చి 07-కెరటం న్యూస్:

**రానున్న పార్లమెంట్ ఎన్నికల** సంగ్రామంలో అబద్ధాల కాంగ్రెస్ ను చిత్తుగా ఓడించి ,అభివృద్ధి ప్రదాత,బడుగు బలహీన వర్గాల పెన్నిధి నామ నాగేశ్వరరావును మంచి మెజార్టీతో గెలిపించుకుని, పార్ల మెంట్‌కు పంపుదామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఖమ్మం పార్ల మెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ గురు వారం ఖమ్మంలోని వీవీసీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మిగతా 2లో..

## బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు, నామ, మాజీ మంత్రి పువ్వాడకు ఖమ్మంలో
# అపూర్వ స్వాగతం



ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

**ఎంపీ వద్దిరాజుకు,**వారితో పాటు ఖమ్మం విచ్చేసిన లోకసభలో బీఆర్ఎస్ పక్ష నేత నామ,మాజీ మంత్రి పువ్వాడలకు అపూర్వ స్వాగతం పలికారు. రాజ్య సభకు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం తొలిసారి విచ్చేశారు.లిఈ సందర్భంగా నగర శివార్లలో గులాబీ శ్రేణులు, సహచరులు, అను చరులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, యువకిశోరాలు, అభిమానులు ఘనంగా స్వాగతం మిగతా 2లో..



## పాలమూరు వెనకబాటుకు కాంగ్రెస్, టిడిపిలే కారణం

2





## టిడిపి-జనసేన మరో అడుగు

- 17న చిలకలూరిపేటలో భారీ సభ
- ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటన చేస్తామని వెల్లడి

2



## విద్యా, వైద్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్..

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఎన్నికల వేళ జగన్ సర్కార్ కీలక నిర్ణయం..

2

## బాంబులు నీ పక్కనే ఉన్నాయ్ జాగ్రత్త

- కాళేశ్వరం రిపేర్ చేయకుండా డ్రామాలు
- కరీంనగర్ బిఆర్ఎస్ సభలో కెటిఆర్ విమర్శలు

2



# ఎమ్మెల్సీల నియామకం చెల్లదు

- ఎమ్మెల్సీలను నియమించే అధికారం కేబినేట్‌దే
- అభ్యంతరాలు ఉంటే తిప్పి పంపాలే తప్ప
- కోదండరామ్, అమీర్ అలీఖాన్‌ల నియామకం చెల్లదు
- గవర్నర్ నిర్ణయాన్ని తప్పుపట్టిన హైకోర్టు

కెరటం న్యూస్, హైదరాబాద్-మార్చి7:

**ఎమ్మెల్సీల నియామకాలపై తెలంగాణ హైకోర్టులో** రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీఖాన్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. భారాస ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆ పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ మంత్రిమండలి తీర్మానం చేసింది. దాన్ని గవర్నర్ తమిళిసై గతేడాది మిగతా 2లో..

## ఆర్టికల్ 370 రద్దుతో ప్రజలకు స్వేచ్ఛ

(మొదటి పేజీ తరువాయి..)

స్వేచ్ఛ లభించిందని, జమ్మూకశ్మీర్ హాయిగా ఊపిరి పీల్చుకుంటోందని చెప్పారు. గురువారం జమ్మూకశ్మీర్‌లో మోదీ పర్యటించారు. దాదాపు రూ.5,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. వాటిని జాతికి అంకితం చేశారు. జమ్మూకశ్మీర్‌లో కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 1,000 మంది యువతకు నియామక పత్రాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళలు, రైతులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సమావేశమయ్యారు. 'చలో ఇండియా గ్లోబల్ డయాస్పోరా క్యాంపెయిన్', 'దేఖో అప్నా దేశ్ పీపుల్స్ చాయిస్ టూరిస్టు డెస్టినేషన్ పోల్' అనే రెండు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం శ్రీనగర్‌లోని బక్షీ స్టేడియంలో 'వికసిత్ భారత్-వికసిత్ జమ్మూకశ్మీర్' బహిరంగ సభలో ప్రసంగించారు.

## లిక్కర్ కేసు పెద్దదేమీ కాదు..

కెరటం న్యూస్, హైదరాబాద్-మార్చి7:
లిక్కర్ కేసు పెద్ద కేసు కాదని ఎమ్మెల్సీ కవిత అభిప్రాయం వ్యక్తం చేశారు. కేసును టీవీ సీరియల్ కేసు లెక్క లాగుతున్నారు.. నాకు ఆమె అన్నారు. ఆదర్శ్ కుంభకోణం ఏమైందని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. సీతక్కకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, మహిళ అయిన ఆమెకు డిప్యూటీ సీఎం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అనుభవరాహిత్యం, అవగాహన లోపంతో సీఎం రేవంత్ పాలన ఉందని, అలాంటి ముఖ్యమంత్రి ఉండడం మన ఖర్మ అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థతతో రాష్ట్రంలో కృత్రిమ కరువు వచ్చిందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లను ఎత్తిపోయలేదని విమర్శించారు.

## విద్యా, వైద్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్..

కెరటం న్యూస్, అమరావతి-మార్చి7:
ఎన్నికల వేళ జగన్ సర్కార్ కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో అమలు చేయని వాటిపై దృష్టి పెట్టింది. అప్పట్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు జగన్ ప్రభుత్వం శుభవార్త అందించింది. విద్యా, వైద్యశాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించిన ఉత్తర్వులను కూడా జారీ చేసింది. ఈ నిర్ణయంతో 2014 కంటే ముందు నుంచి వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు పర్మినెంట్ కానున్నారు. 2014 కంటే ముందు నుంచి ఈ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు దాదాపు 2146 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరందరిని రెగ్యులరైజ్ చేసారు. దీనికి సంబంధించి వైద్యశాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు ఇవాళ జీవో జారీ చేశారు. మొత్తం 2146 కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో 2025 మంది పని చేస్తుండగా.. డీఎంఈ పరిధిలో 66 మంది సేవలు అందిస్తున్నారు. ఇక కుటుంబ సంక్షేమ డిపార్ట్మెంట్‌లో 55, ఆయుష్, యునాని విభాగంలో 4 కాంట్రాక్ట్ ఉద్యోగుల పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరి ఉద్యోగాలు పర్మినెంట్ అయ్యాయి.

## సవాల్ విసిరితే.. దేనికైనా సిద్ధం

కెరటం న్యూస్, న్యూఢిల్లీ-మార్చి7:
భారత్- చైనా సరిహద్దు వివాదం నేపథ్యంలో చైనాకు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. భారత్ ఇప్పటి వరకు ఏ దేశంపై దాడి చేయలేదని తెలిపిన కేంద్ర మంత్రి.. ఏ ప్రాంతాన్నీ కూడా ఆక్రమించుకోలేదన్నారు. అదే ఒకవేళ ఏ దేశమైనా భారత్‌కు సవాల్ విసిరితే.. తాము ధీటైన సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. చైనా సరిహద్దులో కొంతకాలంగా ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో రక్షణమంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ మేరకు ఓ జాతీయ మీడియా నిర్వహించిన 'డిఫెన్స్ సమ్మిట్'లో గురువారం రాజ్‌నాథ్ సింగ్ పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్ల కాలంలో భారత రక్షణ రంగంలో చోటు చేసుకున్న మార్పులను, అభివృద్ధి వంటి అంశాలపై సైతం చర్చించారు. భూమి, గగనతలం, సముద్రం నుంచి ఎవరైనా భారత్‌పై దాడికి దిగితే తమ బలగాలు ధీటుగా బదులిస్తాయని హెచ్చరించారు. తాము ఏ దేశంపైనా దాడి చేయలేదని.. ఎవరి భూభాగాన్నీ అంగుళం కూడా ఆక్రమించలేదన్నారు.

## పదేళ్లు గొర్రెలుగా మార్చారు

కెరటం న్యూస్, విజయవాడ-మార్చి7: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఊపిరి లాంటిది. ఈ విషయంలో తల్లి లాంటి ఏపీని జగన్ వెన్నుపోటు పొడిచారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ప్రతిపక్ష నేతగా నిరాహార దీక్షలు చేశారు. మూకుమ్మడి రాజీనామాలు చేద్దామన్నారు. సీఎం అయ్యాక ఆ పార్టీ నుంచి ఒక్కరైనా రాజీనామా చేశారా? ఒక్కరైనా నిజమైన పోరాటం చేశారా? అని సూటిగా ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తానని వైఎస్ షర్మిల ప్రకటించారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లు అవుతున్నా హోదా రాలేదన్నారు. పదేళ్ల నుంచి ఆంధ్రవారిని అధికార పార్టీలు గొర్రెలను చేశారని షర్మిల ధ్వజమెత్తారు. హోదా కోసం సింహాల మాదిరిగా ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. హోదా గురించి తలచుకొని షర్మిల కన్నీటి పర్యంతం అయ్యారు. 'గత పదేళ్ల నుంచి హోదా ఊసే లేదు. హోదా అంటే ఏంటోనని వింతగా చూస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ కోసం ప్రత్యేక హోదా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఉద్యమించాలని నిర్ణయించుకుంది.

## బాంబులు నీ పక్కనే ఉన్నాయ్ జాగ్రత్త

కెరటం న్యూస్, కరీంనగర్-మార్చి7:
మానవ బాంబులు ఎక్కడో లేరు.. రేవంత్ రెడ్డి పక్కనే ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఖమ్మం, నల్లగొండ మానవ బాంబులే రేవంత్‌ను ఖతం చేస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. నిన్న గాక మొన్న మోదీ తెలంగాణకు వచ్చారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పాటు మరోచోట పర్యటించి, ఒకట్రెండు కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి వెళ్లిపోయారు. ఆ సందర్భంగా రేవంత్ మాట్లాడిన మాటలు, నిన్న కూడా పాలమూరులో మాట్లాడిన మాటలు వినే ఉంటారు. మూడు నెలలుగా ఆయన మాటలు గమనిస్తూనే ఉన్నారు. ఆవేశంతో ఊగిపోతూ నోటికొచ్చిన మాటలు మాట్లాడుతున్నారు. అధికారంలో ఉండి ఫ్రస్టేషన్‌కు గురవుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.నేను జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నా. పిచ్చిపిచ్చిగా మాట్లాడితే.. గొంతు కోస్తా.. కడుపు చింపుతా.. మా పేగుల మెడల వేసుకొని తిరుగుతా.. మా ప్రభుత్వాన్ని ఏమన్న జేస్తే మానవ బాంబులైతాం అని రేవంత్ అంటున్నారు. ఆయన మాటలు వింటుంటే చాలా విచిత్రంగా అనిపిస్తుంది. జేబుల్లో కత్తెర్లు పెట్టుకుని.. జేబు దొంగలు తిరుగుతారు. కానీ ఆయన జేబుల కత్తెర్లు పెట్టుకుని తిరగడం ఏంటో అర్థం కావడం లేదు. అలాంటోడు మన ముఖ్యమంత్రి అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గతంలోనూ సెక్రటేరియట్‌లో మాట్లాడుతూ.. ఇక్కడ లంకె బిందెలు ఉన్నాయనుకొని వచ్చాను అని రేవంత్ అన్నారు. లంకె బిందెల కోసం ఎవరు తిరుగుతారు. ఈ లంకె బిందెల కథ, జేబుల కత్తెర్ల కథ అర్థం కావడం లేదు. నీ పక్కనే నల్లగొండ బాంబు, ఖమ్మం మానవ బాంబులు ఉన్నాయి. వాళ్లే నిన్ను ఖతం చేస్తారు. మేం ఏం చేయం. నీవు ఐదేండ్లు ఉండాలి.. నీవు ఇచ్చిన 420 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని స్పష్టం చేశారు.

# వారిది సంఘర్షణ.. మాది సహకారం

(మొదటి పేజీ తరువాయి..)

ఆయన పోరాటం చేసినట్లుగా చెప్పుకోవటం ఏమిటని సీఎం ప్రశ్నించారు. 'గతంలో కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని అన్నరు. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని కేటీఆర్ సచ్చుడో అభివృద్ధికి కేంద్రం నిధులు వచ్చుడో అని కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలి. మీకు కాపలాగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును ఉంచుతా' అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వికారాబాద్ పూడూర్‌లో నౌకాదళానికి భూముల కేటాయింపు, చాంద్రాయణగుట్ట రక్షణశాఖ భూముల లీజ్ రెన్యువల్ అంశాల్లోనూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందని, తాము అధికారం చేపట్టగానే అధికారులతో సమీక్షించి పూడూర్‌లో 2 వేల ఎకరాలను నౌకాదళానికి, 2,400 ఎకరాల ఇమ్రాత్ భూములను కేంద్రానికి అప్పగించామని సీఎం వెల్లడించారు. ఈ విధంగా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంతో కేంద్రం రాష్ట్రానికి సహకరించిందన్నారు. రక్షణ శాఖ అంటే దేశ భద్రతకు సంబంధించినదని.. అందుకే సత్వర నిర్ణయం తీసుకున్నామని, అంతేగాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఘర్షణతో ప్రజలు నష్టపోతారని భావించి ఆ పరిస్థితి తలెత్తకుండా భూములు అప్పగించామని తెలిపారు. హైటెక్‌సిటీ, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు తరహాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్ ప్రాంతాల అభివృద్ధి జరగాలంటే ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణం జరగాలని.. ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ఎలివేటెడ్ కారిడార్ ముఖద్వారం వంటిదని సీఎం పేర్కొన్నారు. 'రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతూనే ఉంటాం. రాబట్టుకుంటాం. ఇవ్వకపోతే కచ్చితంగా కేంద్రంతో కొట్లాడుతాం. ఇందులో ఎలాంటి శషభిషలకు తావులేదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవ్వరితోనైనా కొట్లాడే శక్తి మాకుంది. ఆ శక్తి ప్రజలే ఇచ్చారు. ప్రజాప్రయోజనాల కోసం ఒక మెట్టు దిగడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల ప్రధాని మోదీ వచ్చినప్పుడు.. తుమ్మిడిహెట్టి, మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రోరైలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల తదితర అంశాలపై విజ్ఞప్తి చేశామని, ఆయన సానుకూలంగా స్పందించినట్లు అనిపించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# ఎమ్మెల్సీల నియామకం చెల్లదు

(మొదటి పేజీ తరువాయి..)

సెప్టెంబర్ 19న తిరస్కరించారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వారిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. గవర్నర్ పరిధి దాటి వ్యవహరించారని, మంత్రిమండలికి ఎమ్మెల్సీలను నామినేట్ చేసే హక్కు ఉంటుందని పిటిషనర్లు పేర్కొన్నారు. భారాస నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. అనంతరం రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యాక నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమిర్ అలీఖాన్‌లను రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసి గవర్నర్ వద్దకు పంపింది. రాష్ట్ర మంత్రిమండలి సిఫార్సును అనుసరించి వారి పేర్లను తమిళిసై ఆమోదించారు. అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం కూడా లభించడంతో వారి నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే దీన్ని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. గతంలో తాము వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెలువడే వరకూ ఈ నియామకాలు ఆపాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై పిటిషనర్లు, రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ కార్యాలయం తరఫున న్యాయవాదులు సుదీర్ఘ వాదనల వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌ను కొట్టివేస్తూ గురువారం తీర్పు వెలువరించింది. ఎమ్మెల్సీల నియామకంపై ప్రభుత్వం పునఃసమీక్షించుకోవాలని సూచించింది.

## బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు, నామ, మాజీ మంత్రి పువ్వాడకు ఖమ్మంలో

# అపూర్వ స్వాగతం




(మొదటి పేజీ తరువాయి..)

పలికారు. లినగరంలోని కాల్వొడ్డు,మయూరి చౌరస్తాలో ఎంపీలు రవిచంద్ర, నాగేశ్వరరావు, మాజీ మంత్రి అజయ్ కుమార్ తదితర ప్రముఖులను యువత గజమాలలతో సత్కరించారులి లివీవీసీ ఫంక్షన్ హాలులో జరిగిన బీఆర్ఎస్ లోకసభ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో రాజ్యసభకు తిరిగి ఎన్నికైన వద్దిరాజును మాజీ మంత్రి పువ్వాడ, పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధు,మాజీ ఎమ్మెల్యే సండ్ర తదితరులు శాలువాలతో సన్మానించారులి లిఅ తర్వాత గాయత్రి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన సన్మానసభకు,కృతజ్ఞతా సభకు ఎంపీ రవిచంద్ర వందలాది మంది వెంట రాగా ఊరేగింపుగా చేరుకున్నారులి లిగ్రౌండ్స్ వద్ద లంబాడీ మహిళల నృత్యాలు,డీజే, డప్పులు, టపాకాయలు కాల్చుతూ యువత ఆత్మీయ స్వాగతం పలికిందిలి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ముందుండి పోరాడానని, పార్లమెంటులో మొట్ట మొదటి ఓటు తానే వేశానని లోకసభ సభ్యులు నామ నాగేశ్వరరావు చెప్పారు.కరువు కాటకాలతో అల్లాడుతున్న తెలంగాణను పదేళ్ల పాలనలో కేసీఆర్ గొప్పగా అభివృద్ధి చేశారన్నారు.ఎంపీ రవిచంద్రను బీఆర్ఎస్ అధినేత రాజ్యసభకు తిరిగి పంపడం పట్ల కేసీఆర్ కు కృతజ్ఞతలు చెబుతూ,వద్దిరాజుకు అభినందనలు తెలుపుతూ ఖమ్మంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ నాగేశ్వరరావు మాట్లాడారు.ఈ సభకు అధ్యక్షత వహించిన పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ, బహుజనుల బిడ్డ రవిచంద్రను రాజ్యసభకు తిరిగి పంపిన కేసీఆర్ మనమందరం సంపూర్ణ మద్దతునిద్దామన్నారు.ఈ సందర్భంగా సన్మాన గ్రహీత,ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ,తన పట్ల అచంచలమైన విశ్వాసం,ప్రేమతో రాజ్యసభకు మరోసారి ఎంపిక చేసిన మహానేత కేసీఆర్ కు శిరస్సువంచి నమస్కరిస్తున్నన్నారు.పార్టీలో చేరిన కొద్దిరోజులలోనే తనను పెద్దల సభకు పంపడం,అప్పుడిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ రాజ్యసభకు తిరిగి పంపండం గొప్ప విషమన్నారు.తెలంగాణలో ఓకే ఒక్క అవకాశం ఉంటే,అది బీసీ బిడ్డనైనా తనకిచ్చిన మహనీయులు కేసీఆర్ అని రవిచంద్ర కొనియాడారు. తాను ఇనుగుర్తిలో పుట్టినా, ఖమ్మం ద్వారానే గుర్తింపు వచ్చిందని,పదవి వరించిందని వివరించారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం జిల్లాకు పదవులు ఇవ్వడమే కాక నిధులు కూడా పెద్ద ఎత్తున ఇచ్చి అద్భుతంగా అభివృద్ధి చేశారన్నారు.గత ఎన్నికల్లో ఆ విశ్వాసాన్ని మనం నిలబెట్టుకోకపోవడం తీవ్ర విచారకరమని ఎంపీ వద్దిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా వల్లనే రాజకీయంగా నష్టపోయామనే అపవాదును చెరిపేయాలంటే,వచ్చే లోకసభ ఎన్నికల్లో నామ ఘన విజయం కోసం మనమందరం అంకిత భావంతో ముందుకు సాగుదామన్నారు.కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ, వద్దిరాజు కేవలం ఒక కులానికి మాత్రమే పరిమితం కాదని ప్రజలందరికి చేరువైన నాయకుడన్నారు. దైవానికి, సమాజానికి ఆయన అందించిన, చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రవిచంద్రకు తిరిగి రెన్యూవల్ చేస్తానని మాట ఇచ్చి నిలుపుకున్న కేసీఆర్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.ఈ సభలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ,వద్దిరాజును మహానేత కేసీఆర్ రాజ్యసభకు తిరిగి నామినేట్ చేయడంతో బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం మరింత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వీ.ప్రకాష్ మాట్లాడుతూ, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అంకితభావంతో కృషిసల్పారన్నారు.తెలంగాణ తొలి బీసీ కమిషన్ సభ్యులు, సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ,కేసీఆర్ మరోసారి ఇచ్చిన ఈ అవకాశం ద్వారా రవిచంద్ర ఇదే మాదిరిగా పేద బడుగు బలహీన వర్గాల గొంతుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.తమ బహుజనుల బిడ్డ,పేదల పెన్నిధి, జనహృదయ నేత వద్దిరాజును తిరిగి రాజ్యసభకు పంపడం పట్ల హర్షాతిరేకలు వ్యక్తం చేస్తూ, ఇందుకుగాను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కతజ్ఞతలు తెలుపుతూ యువత పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.ఈ సభలో గొర్రెలు,మేకల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ మాట్లాడుతూ,వద్దిరాజు నిజంగా పెద్దిరాజు అని, విశాల హృదయులని,పేద బడుగు వర్గాలకు అండగా ఎప్పుడూ వర్ధిల్లుతూనే ఉండాలని వ్యాఖ్యానించారు.క్రీడా ప్రాధికార సంస్థ మాజీ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ 60ఏళ్ల పాలనలో ఉత్పత్తి కులాలైన బీసీల గొంతు నొక్కారని,అణగదొక్కారని ఆవేదన చెందారు. తెలంగాణకు గుమ్మంగా ఉన్న ఖమ్మం నుంచి ఎదిగివచ్చిన బీసీ వద్దిరాజును కేసీఆర్ తిరిగి రాజ్యసభకు పంపడం మనందరన్ని గౌరవించడమేనన్నారు.ఈ దృష్ట్యా మనమందరం కేసీఆర్ కు కొండంత అండగా ముందుకు సాగుదామన్నారు.ఎంపీ రవిచంద్రకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ ప్రధాన రోడ్లు,కూడళ్లలో పెద్ద సంఖ్యలో హోర్డింగులు,బేలూన్లు,కటౌట్లు,బ్యానర్లు ఏర్పాటు చేయడంతో ఖమ్మం నగరం గులాబీమయంగా మారింది.ఈ సందర్భంగా సభికులంతా "జై తెలంగాణ జైజై తెలంగాణ"," వర్ధిల్లాలి వర్ధిల్లాలి కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి","జిందాబాద్ జిందాబాద్ బీఆర్ఎస్ జిందాబాద్"అంటూ పెద్ద పెట్టున నినదించారు.ప్రమాదవశాత్తు ఇటీవల ప్రాణాలు కోల్పోయిన దివంగత ఎమ్మెల్యే లాస్యనందితను స్మరించుకుంటూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య,వనమా వెంకటేశ్వరరావు,మెచ్చా నాగేశ్వరరావు,తాటి వెంకటేశ్వర్లు,మదన్ లాల్, హరిప్రియ, ఖమ్మం నగర మేయర్ నీరజ, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దిండిగల రాజేందర్, కొత్తగూడెం మునిసిపల్ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ,బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షులు పగడాల నాగరాజు,సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్, తెలంగాణ ఇంజనీర్స్ జేఏసీ ఛైర్మన్ తన్నీరు వెంకటేశం, మున్నూరుకాపు ప్రముఖులు కొండా దేవయ్య, సర్దార్ పుట్టం పురుషోత్తం రావు,ఆకుల గాంధీ,పారా నాగేశ్వరరావు,శీలంశెట్టి వీరభద్రం, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన రాజారాం యాదవ్,బొమ్మెర రాంమూర్తి, ఉప్పల వెంకటరమణ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవా సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ , ఎంపీ రవిచంద్ర అన్నలు వద్దిరాజు కిషన్,వద్దిరాజు దేవేందర్,వద్దిరాజు పెద్ద వెంకటేశ్వర్లు,వద్దిరాజు చిన్న వెంకటేశ్వర్లు, ప్రముఖ జర్నలిస్టులు రమేష్ హజారీ,కట్టా రాఘవేంద్ర రావు,కార్పోరేటర్లు తోట వీరభద్రం,తోట గోవిందమ్మ బీఆర్ఎస్ నాయకులు తోట రామారావు,రుద్రగాని ఉపేందర్,మాటేటి కిరణ్ కుమార్,ముక్కాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ గాయకురాలు మధుప్రియ తన ఆటాపాటలతో అందరిని మెప్పించారు.

## గెలుపే ఏకైక లక్ష్యంగా బీఆర్ఎస్

# ఎన్నికల శంఖారావం







(మొదటి పేజీ తరువాయి..)

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్,జెడ్పీ ఛైర్మన్ లింగాల కమలరాజు, మాజీ ఎమ్మె ల్యేలు వనమా వెంకటేశ్వరావు, సండ్ర వెంకటవీరయ్య,మెచ్చా నాగేశ్వర రావు, ఎమ్మెల్సీ తాతా మధు, కొండబాల కోటేశ్వర రావు , బాణోత్ మదన్‌లాల్ తదితరులు మాట్లాడారు. నీతి, నిజాయితీకి నిలువుటద్దం నామ..ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల గొంతుకై పార్లమెంట్‌లో పెద్ద ఎత్తున గళం విప్పిన సత్తా ఉన్న నాయకుడు నామ అని కొనియాడారు. కేసీఆర్,కేటీఆర్ దిశా నిర్ధేకత్వంలో పార్లమెంట్‌లో తెలంగాణ గురించి పోరాడిన గొప్ప నాయకుడు నామ అని పేర్కొన్నారు. ప్రస్తుత మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నామ గెలుపు అత్యంత అవశ్యమని అన్నారు. కేసీఆర్ , కేటీఆర్ ఖమ్మం జిల్లాకు ఎంతో ఇచ్చారు.. .కానీ మనం ఆయనకేమి ఇవ్వలేదు.. ఇప్పుడు ఆ సమయం వచ్చిందీ..నామను భారీ మెజార్టీతో గెలిపించుకుని, కేసీఆర్‌కు గిఫ్టుగా ఇద్దామని అన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరం బాధ్యతతో ఎన్నికల్లో పని చేసి, పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసుకుందామని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్ దిశా నిర్ధేశకత్వంలో ప్రతి ఒక్కరం సమైఖ్యంగా ముందుకు పోదామని అన్నారు. నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల్లో అతికొద్ది సమయంలోనే ఎంతో మార్పు వచ్చిందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ సునాయసంగా గెల్చుకుని తీరుతుందని అన్నారు.గత 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ ప్రజాజీవితంలో ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అండదండగా ఉంటున్నానని అన్నారు.ప్రజలే నా ఆయుధమని, వారి దీవెనలే నాకు గెలుపు ఆశీస్సులని, తప్పకుండా మంచి మెజార్టీతో గెలుస్తానని అన్నారు.ఖమ్మం జిల్లా ప్రజలు రెండుసార్లు ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపితే పార్లమెంట్‌లో జిల్లా ప్రజల గొంతుకై, సమస్యలపై గళం విప్పానని,తెలంగాణ ఏర్పాటు సమయంలో కూడా పార్లమెంట్‌లో తన మొదటి ఓటును వేసి, తెలంగాణ ఏర్పాటులో ముందున్నానని అన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని,గత పదేళ్లలో సుభిక్షంగా ఉన్న ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులు పడుతున్నారని, కరెంట్, నీళ్లు అందక పంటలు ఎండుతున్నాయని,అనేక సమస్యలతో రైతులు ఇబ్బందిపడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఖమ్మంలో తన గెలుపు తథ్యమని నామ స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదం మళ్ళీ తనకే ఉంటుందని నామ పేర్కొన్నారు.రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కేసీఆర్ జిల్లాకు మహత్తర అవకాశాలు ఇచ్చారని, ఆయనకు మాత్రం మనం ఏమి ఇవ్వలేకపోయామని, ఇప్పుడు నామ నాగేశ్వరావు గెలిపించుకుని, గిఫ్టుగా ఇద్దామని చెప్పారు. నామ సత్తా ఉన్నా నాయకుడని, ఢిల్లీలో ఆయన నాయకత్వం లో ముందుకు సాగుతున్నామని అన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మా ట్లాడుతూ కేసీఆర్ ప్రాణాలు ఒడ్డి సాధించిన తెలంగాణను అన్నింటా నెంబర్‌వన్‌గా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను కష్టాలు పాలు చేస్తుందని అన్నారు.రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అంతా సమైఖ్యంగా కలిసి నామ నాగేశ్వరరావును గెలిపించుకుని,పార్టీని మరిం త ముందుకు తీసుకుపోదామని పేర్కొన్నారు. నామ గెలుపే రాజకీయ లక్ష్యంగా ముందుకు సాగుదామని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. కేసీఆర్,పార్టీ ఇచ్చిన ల్కెన్‌లో నామ పార్లమెంట్‌లో జిల్లా ప్రజల వాణిని ఎంతో బలంగా వినిపించారని, కష్టకా లంలో కార్యకర్తకు అండగా ఉండే నామకు అండగా నిలుద్దామని అన్నారు. నామను గెలిపించుకుంటేనే అందరికీ భవిష్యత్ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు.సమిష్టి కృషితో ఎన్నికల కదన రంగంలోకి దూకుదామని ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. అన్ని అంశాలు ప్రజలు వివరించి, సమస్యలు గుర్తించి, ప్రజలకు అండగా ఉందామని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ నామ నాగేశ్వరరావును, వద్దిరాజు రవి చంద్రను శాలువతో ఘనంగా సన్మానించారు. అంతకముందు జిల్లా సరిహద్దుల్లో నుంచి వారిని ఊరేగింపుగా సమావేశ స్థలి వద్దకు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా భారీ కార్ల, మోటారు సైకిళ్ల ర్యాలీ జరిగింది. ఈ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, బాణోత్ మదన్‌లాల్, బాణోత్ మదన్‌లాల్, చంద్రావతి, జెడ్పీ ఛైర్మన్ లింగాల కమలరాజు, తాటి వెంకటేశ్వర్లు, కొండబాల కోటేశ్వరరావు, మాజీ డీసీసీబీ అధ్యక్షులు కూరకుల నాగభూషణం, బచ్చు విజయకుమార్, మేయర్ పునుకొల్లు నీరజ, జెడ్పీ వైస్ ఛైర్మన్ మరికంటి ధనలక్ష్మీ, మధిర మున్సిపల్ ఛైర్మన్ మొండితోక జయకర్, మైనార్టీ నాయకులు ఖమర్, షౌకత్ అలీ,న్యాయవాద జేఏసీ నాయకులు బిచ్చాల తిరుమలరావు, పార్టీ నాయకులు పగడాల నాగరాజు, కర్నాటి కృష్ణ, ఉప్పల వెంకటరమణ, డోకుపర్తి సుబ్బారావు, మహేశ్, కృష్ణ చైతన్య, జోగేశ్వరరావు, జెడ్పీటీసీ నాగమణి, కోనేరు చిన్నితో పాటు వివిధ మండల పార్టీ అధ్యక్షులు, ఎంపిపీలు, జెడ్పీటీసీ, ఎంపిటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి-జనసేన మరో అడుగు

కెరటం న్యూస్, అమరావతి,మార్చి7: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల వేడి మరింత తీవ్ర స్థాయికి వెళ్తోంది. ఇప్పటికే అభ్యర్థుల ప్రకటనతో ముందంజలో ఉన్న టీడీపీ జనసేన ఇప్పుడు మేనిఫెస్టోపై ఫోకస్ పెట్టింది. బుధవారం సమావేశమైన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ చర్చల్లో భాగంగా మేనిఫెస్టోపై కూడా ఓ నిర్ణయానికి వచ్చారు. టీడీపీ, జనసేన కూటమి ఉమ్మడి మేనిఫెస్టో ఈనెల 17న విడుదల చేయాలని నిర్ణయంచారు. ఇరు పార్టీల అధినేతల సూచనలతో సమావేశమైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ గురువారం ఉదయం సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. చిలకలూరిపేటలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి అందులో ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేయాలని నిర్ణయించారు.

## పాలమూరు వెనకబాటుకు కాంగ్రెస్, టిడిపిలే కారణం

కెరటం న్యూస్, సంగారెడ్డి-మార్చి7: మహబూబ్‌నగర్ వెనుకబాటుతనానికి నాటి టీడీపీ, కాంగ్రెస్ పాలనే కారణమని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సీఎం రేవంత్ తిట్టాల్సి వస్తే తన గురువు చంద్రబాబును తిట్టాలని, కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను నిందించాలన్నారు. చంద్రబాబు పాపాలు, కాంగ్రెస్ పార్టీ లోపాలు పాలమూరు పాలిట శాపాలుగా మారాయని విమర్శించారు. పాలమూరు వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సంగారెడ్డిలో పార్టీ నాయకులతో కలిసి హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. పాలమూరు వలసలకు కారణం టీడీపీ, కాంగ్రెస్‌లేనన్నారు. గత పార్టీలు ప్రాజెక్టుల పేర్లు మార్చారు తప్ప పనులు పూర్తి చేయలేదని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో పాలమూరు ప్రాజెక్టులను పెండింగ్ ప్రాజెక్టులుగా మార్చారని విమర్శించారు. ఆ పెండింగ్ ప్రాజెక్టులను కేసీఆర్ రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారని చెప్పారు. పాలమూరును పచ్చబడేలా చేసింది కేసీఆరేనని స్పష్టం చేశారు. పాలమూరుకు మళ్లీ వలసలు తిరిగొచ్చాయన్నారు. 2014కు ముందు పాలమూరు ఎలా ఉండేది.. ఇప్పుడెలా ఉందని ప్రశ్నించారు. పాలమూరును ఆనాడు చంద్రబాబు దత్తత తీసుకున్నారని, పదేండ్లు అధికారంలో ఉన్నా చంద్రబాబు పాలమూరుకు చేసిందేమీ లేదన్నారు.

# ఎన్నికల కోడ్ రాక ముందే హామీలు అమలు చేయండి !

## రాష్ట్ర ప్రభుత్వానికి టీఎస్ ఆర్టీసీ : ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

**కెరటం న్యూస్ ప్రతినిధి**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన మూడు ముఖ్యమైన 3 హామీలు (1)ఆర్టీసిని ప్రభుత్వం లో విలీనం చేయడం (2)2017, 2021 వేతన ఒప్పందాలు అమలు చేసి, అరియర్స్ చెల్లించడం, (3) కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తివేయడం, పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే పరిష్కరించి ప్రభుత్వం పట్ల విశ్వాసం కలిగేలా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు రవాణా శాఖా మంత్రికి స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ ఎస్ డబ్ల్యూ ఎఫ్ జిల్లా కార్యదర్శి వీఎస్ రావు, అధ్యక్షులు వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికి సరిగ్గా మూడు నెలలు పూర్తయిందని, కానీ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లు ఆర్టీసిలో కార్మికోద్యమంపై ఆంక్షలు తొలగించనందున, కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకొని పోవడం కష్టంగా వుంది. సమస్యలు పరిష్కారంకాక, వాటిని భరించలేని స్థితిలోకి కార్మికులు నెట్టబడ్డారు. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రతి సర్వీసు 2 నుండి 3 గంటలు లేటుగా ఇన్కమింగ్ అవుతున్నది . నగరంలో మధ్యాహ్నం షిఫ్ట్ లో 2 గంటలు ఆలస్యంగా బస్సును ఇచ్చి కూడా పూర్తి డ్యూటీ చేయని ఒత్తిడి చేస్తున్న ఫలితంగా అర్ధరాత్రి డ్యూటిలు దిగే పరిస్థితి ఏర్పడింది. శాస్త్రీయంగా రన్నింగ్ టైమ్ ను నిర్ణయించాలని కోరుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఈ రోజున ఆర్టీసి ఈ స్థితిలో నిలబడ్డదంటే ఆర్టీసి పరిరక్షణ కోసం కార్మికోద్యమం చేసిన కృషి వల్లనే సాధ్యం అయింది. నియంతలాంటి పాలకులు దిగి వచ్చి అప్పటి వరకు తాము వసూలు చేస్తున్న పన్నును తగ్గించడమేకాక ప్రజలకు ఇస్తున్న రాయితీలను 100శాతం తిరిగి చెల్లిస్తామని అంగీకరించారన్న విషయం గమనించాలి.గత ప్రభుత్వం కార్మికోద్యమంపై ఆంక్షలు విధించడమే కాక, కార్మికులకు 2017, 2021 సం॥లలో రావలసిన వేతన ఒప్పందాలు చేయలేదు. 2024 సం౹ఎలో ఉన్నా కూడా 2013 నాటి వేతనాలతోనే కుటుంబాలను పోషించుకోవలసిన పరిస్థితిలో వుండటంతో పాటు సామాజిక భద్రతా పథకాలు కూడా నిర్వీర్యం చేయబడుతున్నందున తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.ఆర్టీసిలో వేతన ఒప్పందాలు మరియు సర్వీసు కండీషన్లపై ఒప్పం దాలు అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలుగా జరిగాయని, క్లాజు 12(3) క్రింద లేబర్ కమీషనర్ వద్ద అగ్రిమెంటు చేయబడ్డాయి. నేడు కార్మిక సంఘాలకు అనుమతి ఇవ్వకుండానే, కార్మిక సంఘాలతో ఎటువంటి ఒప్పందం లేకుండానే, ప్రభుత్వం ఏకపక్షంగానే వేతన ఒప్పందంపై ప్రకటన చేసే పరిస్థితి ఏర్పడిందని, ఈ పరిస్థితిని సరిచేయాలని ఎస్ డబ్ల్యూ ఎఫ్ కోరుతున్నది. ప్రభుత్వానికి ఒక్క పైసా ఖర్చు కానప్పటికీ, ఆర్టీసిలో యూనియన్లను అనుమతిస్తూ ఎందుకు నిర్ణయం చేయట్లేదని ఎస్ డబ్ల్యుఎఫ్ అభిప్రాయపడింది.త్వరలో పార్లమెంటు ఎన్నికల కోడ్ వస్తుందని ఎన్నికల సంఘం ప్రకటనలు వస్తున్నాయి. కోడ్ అమలులో వుండగా కొన్ని నిర్ణయాలు చేయడం కష్టం. అందుకని కోడ్ వెలువడక ముందే ఆర్టీసిలో కార్మిక సంఘాలను అనుమతిస్తూ ప్రకటన చేయాలని, అలాగే హామీ ఇచ్చినట్లు 2017, 2021 వేతన ఒప్పందాలను అవి అమలుకావలసిన తేదీ నుండి అమలులోకి వచ్చేలా చేసి వాటి అరియర్స్ ను తక్షణమే చెల్లించేలా నిర్ణయం ప్రకటించాలని కోరుతు న్నాము. 2017 నాటికి వున్న డి.ఎ. 31% మెర్జ్ చేస్తూ ఆనాడు రాష్ట్ర ప్రభుత్వోద్యోగులతో సమానమైన వేతనాలు పొందేలా ఫిట్మెంట్ ని నిర్ణయించాలని, అలాగే 2021 నాటి వేతన ఒప్పందాన్ని నిర్ణయించాలని కోరుతున్నాము. వాటితో పాటు ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియపై పూర్తి చేయాలని కోరుతున్నాము. ఈ హామీలు నెరవేర్చి కార్మికులు ఈ ప్రభుత్వం పట్ల విశ్వాసం కోల్పోకుండా చూడాలని కోరుతున్నామని స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ ఎస్ డబ్ల్యూ ఎఫ్ జిల్లా కార్యదర్శి వీఎస్ రావు, అధ్యక్షులు వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు.



## మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిర నందు విద్యార్థినీ విద్యార్థులకు ఆటల పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు క్విజ్ నిర్వహించబడ్డాయి. అంతేకాక అధ్యాపక అధ్యాపకేతర బృందానికి కూడా వివిధ ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా కళాశాలలో ముఖ్య అతిథిగా హాజరైన సుజనడోరతిని ఘనంగా సన్మానించడం జరిగింది. ముఖ్య అతిథి శ్రీమతి సుజనడోరతిఅంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాధాన్యతను, స్త్రీ విద్య ఆవశ్యకతను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ రవి కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ సుజాత ,అర్థశాస్త్ర అధ్యాపకురాలు అరుణ, వీరన్న, శ్రీనివాసరావు, అఫ్రోజ్, పుణ్యవతి, నాగలక్ష్మి అధ్యాపకేతర బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.



## మధిర లైబ్రరీకి మూడులక్షల రూపాయలు విలువ చేసే పుస్తకాలు వితరణ

**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి**

హైదరాబాద్‌కు చెందిన డా. ఆర్. శివరామకృష్ణ ప్రసాద్ సుమారు 3లక్షల రూపాయలు విలువచేసే అత్యంత విలువైన నవలలు, డిక్షనరీ లు,పుస్తకాలను మధిర ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కొంగర మురళి, హైదరాబాద్ వీఎన్ అర్ ఇంజనీరింగ్ కాలేజీ లైబ్రరీయన్ మచ్చా ఫణికుమార్ ద్వారా మధిర లైబ్రరియన్ నాగలక్ష్మి కి పుస్తకాలను వితరణ చేసారు. ఈ కార్యక్రమం లో టీవీఎం పూర్వ విద్యార్థుల సంగం అధ్యక్ష, కార్యదర్శులు పుతంబాక కృష్ణ ప్రసాద్, మాధవరపు నాగేశ్వరావు,15 వార్డ్ కౌన్సిలర్ కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వర్లు, కోనా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల నుండి డబ్బు రికవరీ

**కెరటం న్యూస్, గార్ల ప్రతినిధి**



అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి మోసానికి గురి కావద్దని గార్ల బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ అన్నారు సైబర్ నేరస్తుల చేతిలో మోసపోయిన ఘటనలో నిందితుల నుంచి రికవరీ చేసిన సొమ్మును బాధితునికి గురువారం సిఐ రవికుమార్ అందజేశారు వివరాల్లోకి వెళితే గార్ల మండల పరిధిలోని రాజు తండా గ్రామానికి చెందిన నునావత్ రఘురాం 2022 సంవత్సరంలో సైబర్ క్రైమ్ నేరగాళ్ల మాయలో పడి ఖాతాలోని నగదు పోగొట్టుకోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి సైబర్ క్రైమ్ నిందితుల నుంచి రికవరీ చేసిన సొమ్మును బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ బాధితునికి 48429 రూపాయల చెక్కును అందజేశారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యాశకు వెళ్లి వ్యక్తిగత బ్యాంకు సమాచారం వారికి ఇస్తే ఖాతాల్లో ఉన్న నగదు దోచేస్తారని పార్టుటైమ్ జాబ్‌లు, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్, . కొరియర్.. బిల్లుల పేరుతో ఎవరు ఫోన్‌చేసినా నమ్మవద్దని, భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఒక వేళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేయాలన్నారు. ఘటన జరిగిన రెండు గంటల్లోపు %ఎఎవతీఎతీఱ ఎవ.స్త్రశీఙ. ఱఅ%లో ఫిర్యాదు చేస్తే మీ డబ్బు ఫ్రీజ్ అయ్యే అవకాశం ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తాను మోసపోయిన డబ్బులను రికవరీ చేసి అందజేసిన సీఐ రవికుమార్ గారికి స్థానిక ఎస్ఐ జీనత్ కుమార్ గారికి కు సిబ్బందికి బాధితుడు రఘురామ్ కృతజ్ఞతలు తెలిపాడు.

## జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారిగా బి.వి. రమణ

**ఖమ్మం కలెక్టరేట్, కెరటం న్యూస్**

ఖమ్మం జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారిగా శ్రీ బి.వి. రమణ నియమిస్తూ తెలంగాణ ఉద్యాన శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న శ్రీ మతి జి. అనసూయ గారిని ములుగు జిల్లా ఇన్చార్జి గా నియమిస్తూ బదిలీ చేశారు. బి.వి. రమణ గతంలో జిల్లాలో ఉద్యానధికారిగా వివిధ నియోజకవర్గలలో పనిచేసిన అనుభవం ఉంది. వివిధ మండలాల్లో ఉద్యాన పంటలకు సాగు కొరకు అలాగే లక్నో, కులుమనాలి, ఢిల్లీ, తమిళనాడు వంటి ఉద్యాన శిక్షణ కార్యక్రమాలకు జిల్లా రైతులను శిక్షణ అందించుటకు తీసుకెళ్లిన అనుభవం ఉన్నది. ప్రాజెక్టు ఉద్యాన అధికారిగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏ నందు 3 సంవత్సరాల తరువాత ములుగు జిల్లా ఉద్యాన అధికారిగా పనిచేశారు.

# కళా రంగంలో రాణిస్తున్న నట శిరోమణి నంద్యాల సత్య కుమారి

### తండ్రి ప్రోత్సాహంతో నాటక రంగ ప్రవేశం

**కల్లూరు, కెరటం న్యూస్ ప్రతినిధి**

ఆమె ....చక్కని ఆహార్యంతో రంగస్థల వేదిక పైకి ప్రవేశిస్తే ప్రేక్షకులు ...మై మరిచిపోతారు ఆమె నటన సౌరభవం రంజింప చేస్తుంది. స్త్రీ, పురుషుల పాత్ర ఏదైనా అలవోకగా జీవం పోసి రాణిస్తారు. సజీవదృశ్యమైన నాటకం తన ప్రాణంగా కళను పోషిస్తున్నారు. అక్షరజ్ఞానం లేని కళాకారిణి పద్యాలను సులువుగా చెప్పడం లో ఆమెకు ఆమె సాటి.పౌరాణిక నాటకంలో పద్యం పాడితే ప్రేక్షకులు పరవశించి పోతారు,ఒదిగి పోతారు. ఆమె ఎవరో కాదు ఖమ్మం జిల్లా.. కల్లూరు మండలం ఎర్రబంజర్ గ్రామానికి చెందిన నంద్యాల సక్కు అలియాస్ సత్య కుమారి. పౌరాణికం, సాంఘికం, జానపద నాటకాలు, బుర్రకథలు ఇలా అన్ని రంగాల్లో ముప్పై ఏళ్లుగా అప్రతిహాత ప్రదర్శనలతో జాతీయ స్థాయి అవార్డులు సాధిస్తూ కళామతల్లి ముద్దుబిడ్డగాజిల్లాకు వన్నె తీసుకొచ్చారు.

**తండ్రి నుంచి అందిపుచ్చుకున్న కళ**

పైళ్ల రాఘవులు నాటకరంగ కళాకారుడు. ఆయన ఆరో సంతానంగా పుట్టిన సక్కును చిన్ననాటి నుంచి నాటకాల వద్దకు తండ్రి వెంట వెళ్లే వారు. దీంతో నాటకరంగంపై మక్కువ పెంచుకున్నారు. స్వతహాగా రంగస్థలం ప్రవేశం ఉన్న కుటుంబం కావడం, కళపై అభిమానం, తండ్రి ప్రోత్సాహంతో... వీరయ్య నాయుడు, పిచ్చేశ్వరరావు గురువుల వద్ద శిక్షణ తీసుకొని ఆమె కూడా తన పదిహేనో ఏటే రంగస్థలంపై కాలు మోపారు. ఆనాటి నుంచి విభిన్న పాత్రలను పోషిస్తూ పలువురి ప్రశంసలతోపాటు అనేక



బిరుదులు, సత్కారాలు పొందారు. జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు సైతం గెల్చుకున్నారు. ఒక్కో ఏడాదిలో అరవైకిపైగా ప్రదర్శనలు చేస్తూ నాటకరంగంలో రాణిస్తున్నారు.

**ప్రత్యేక గుర్తింపు తెచ్చిన పాత్రలు**

సత్యహరిశ్చంద్ర నాటకంలో చంద్రమతి పాత్రకు ఎక్కువ బహుమతులు తెచ్చి పెట్టాయి. బ్రహ్మం గారి నాటకంలో ఆదాంబీ, ఈశ్వరీ పాత్రలతో పాటు, రామాంజనేయ యుద్ధం నాటకంలో శాంతిమతి, తిరుపతమ్మ నాటకంలో తల్లి పాత్ర, పూలరంగడు నాటకంలో ఎస్సై పాత్ర ఇలా లింగబేధం లేకుండా కళాభిమానులను అలరించే పాత్ర లతో ఆహుతులను మెప్పిస్తున్నారు .

**అవార్డులు.. బిరుదులు**

2016లో కళాసౌరభ అవార్డు అందు కున్నారు. 2017లో విశాఖపట్నంకు చెందిన మదర్ థెరిస్సా ఫౌండేషన్ ఉగాది పురస్కార్, 2018లో వే ఫౌండేషన్ జాతీయ స్థాయి కళాకారిణి అవార్డును, 2023 మార్చి 18 వ తారీఖున కళావాణి బిరుదు బంగారు అంగులీకం అందుకున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డులు లభించాయి. గాంధర్వ గాయని, గాన సుధ, నటగానమంజరి, జూనియర్ గూడురు సావిత్రి, కళ సౌరోభామ, నటగాన కోకిల, నాట్య మయూరి, మాధుర్యగాన కోకిల, కళావాణి బిరుదులు అందుకున్నారు.

**కళలను ప్రోత్సహించాలి**

రంగస్థలంలో అత్యంత ప్రతిభ పాటవాలను ప్రదర్శిస్తున్న సత్యకుమారి కళాభిమానాన్ని పొందారు.అంతరించిపోతున్న నాటక రంగంలో మొక్క వోని దీక్షతో నాటకాలను ప్రదర్శిస్తూ మన్న లను పొందుతున్నారు, నాటక రంగ కళాకారులను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాలని ఆమె కోరుతున్నారు. పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తూ తమ పాత్రను బ్రతికిస్తున్న కళా శిరోమణి నంద్యాల సత్యకుమారి కళాకారులకు స్ఫూర్తినిస్తుంది.



# నా బలం.. అండ మీరే



## బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు

**ఖమ్మం బ్యూరో, మార్చి 07, కెరటం న్యూస్**

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నాకు బలం.. అండ కార్యకర్తలు, నాయకులేనని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలో గురువారం నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన పార్టీ పార్లమెంటరీ స్థాయి సన్నాహక స్థాయి సమావేశం సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మళ్లీ చరిత్ర పునరావృతం అవడం ఖాయమని, భారీ మెజార్టీ తో తన గెలుపు తథ్యమని నామ స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు అవిశ్రాంతంగా పని చేయడం వల్ల 1 లక్షా 62 వేల మెజార్టీ పైగా సాధించి, ఘన విజయం సాధించానని గుర్తు చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చరిత్ర పునరావృతం అయ్యేలా మెజార్టీ వస్తుందని అన్నారు. కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉండాలని కేసీఆర్ తనను పార్లమెంట్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారని చెప్పారు. కార్యకర్తలు, నాయకుల అండ, బలం చూసుకునే బరిలో నిలిచానని అన్నారు. పార్లమెంట్ లో తెలంగాణా బిల్లు సందర్భంగా మొదటి ఓటు తానే వేసి, సమర్ధించానని అన్నారు. ఖమ్మం జిల్లానే కాకుండా యావత్ తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులు, నిధులు పై అవిశ్రాంతంగా పోరాడనని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారుల వెనుక తన సుదీర్ఘ పోరాటం ఎంతో ఉందని నామ పేర్కొన్నారు. అండగా ఉండి మంచి మెజార్టీతో గెలిపించాలని నామ నాగేశ్వరరావు కోరారు.

**జైలును సందర్శించిన నామ, పువ్వాడ**

ఖమ్మం జిల్లా కారాగారంలో రిమాండ్ లో ఉన్న బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం అధ్యక్షుడు



దేవభక్తుని కిషోర్ బాబు, మాజీ సర్పంచ్ ప్రదీప్, యువజన నాయకులు వీరేం దర్, సందీప్, రామ్, విజేత లను ములాకత్ సమయం లో ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కలిసి మాట్లాడారు.

## బీఆర్ఎస్ నేత నన్నక కోటయ్యకు ఎంపీ నామ పరామర్శ



**చింతకాని, కెరటం న్యూస్ ప్రతినిధి**

ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న చింతకాని మండలం నేరడ సొసైటీ డైరెక్టర్ నన్నక కోటయ్య ని బీఆర్ ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. కోటయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఓదార్చి, డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నామ వెంట బిక్కసాని దామోదర్ రావు, సరిపూడి గోపి సందేశ్, సరిపూడి వెంకటేశ్వర్లు, నన్నక రవి తేజ, కృష్ణ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు మహిళలు స్వయం స్వావలంబన సాధించాలి

### ఎంపీడీవో ఎం ఎర్రయ్య ఎంపీపీ వజ్జా రమ్య

**కెరటం న్యూస్ నేలకొండపల్లి 7**

మదర్ తెరిసా మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఐకెపి కార్యాలయం నందు మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంపీపీ వజ్జా రమ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా మండలంలోని 32 గ్రామపంచాయతీలలో మహిళా సంఘాలకు ముగ్గుల పోటీలు పోటీలు నిర్వహించారు.మండల కేంద్రంలోని మదర్ తెరిసా మండల సమాఖ్య కార్యాలయం నందు మండల సమైక్య అధ్యక్షులు బోల్లికొండ శ్రీలత అధ్యక్షతన జరిగిన మహిళా దినోత్సవ వేడుకలలో ఎంపీడీవో ఎం ఎర్రయ్య, ఎంపీపీ వజ్జా రమ్య మాట్లాడారు. మహిళలందరూ ఆర్థికంగా స్వాలాంబనతో బలమైన శక్తిగా మారాలని అన్నారు. మహిళలు ఉద్యోగాలలో, రాజకీయ, సామాజిక కార్యక్రమాలలో ముందుండాలని తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎంపీపీ రమ్యను శాలువలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ శివ, నేలకొండపల్లి ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, మండల సమైక్య ఏపీఎం అశోక రాణి, ఏపీవో రావెళ్ల సునీత, సీసీలు పెదపాక వెంకటేశ్వరరావు, నాగమణి, మండల సమైక్య సిబ్బంది, విఓఏలు, ఉపాధి హామీ మహిళా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, గ్రామపంచాయతీ మహిళ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రామిక మహిళా !
## ఓ కార్మిక మహిళా !!

మహిళా ఓ మహిళా ఓ శ్రామిక మహిళా !
మహిళా ఓ మహిళా ఓ కార్మిక మహిళా !!
సమైక్యతా జట్టుకట్టు శ్రామిక మహిళా
సమరశీల జెండా పట్టు కార్మిక మహిళా
అష్టలక్ష్మివి నీవంటూ కష్టాలకు గురిచేస్తరు
సరస్వతివి నీవంటూ చదువుకు దూరం చేస్తరు
ప్రకృతిమాతవు నీవంటూ వికృత చేష్టలు చేస్తరు
సృష్టికి నువ్వే మూలమంటూ సుతుడనే కనమంటరు
అనాచార దురాచార భావాలను వదలవమ్మ
ఆదమరువకే అమ్మ ఆరోగ్యం జాగ్రత్తమ్మ
భ్రూణ హత్యలను ఆపే పోరుబాట సాగవమ్మ
హక్కుల రక్షణ కోసం సంఘర్షణ చేయవమ్మ
అమ్మవు నీవే,ఆదిశక్తివీ నీవే
పుడమితల్లివి నీవే,గంగామాతవూ నీవే
నరకాసుర సంహారివి నీవే మహిళా
మహిషాసుర మర్ధినివీ నీవే మహిళా
సమాజాన్ని మార్చగల చైతన్యం నీవే
అజ్ఞానపు చీకటిలో జ్ఞానజ్యోతి నీవే
అభ్యుదయం తోటలో ఎర్రమల్లె నీవే
అరుణారుణ పతాకంలో వెలుగుచుక్క నీవే



గుండు మాధవరావు
ఆర్టీసీ ఉద్యోగి,భద్రాచలం డిపో.
మొబైల్ నెం : 7382857476

# ఎస్‌బిఐ బ్యాంక్ ఎదుట కాంగ్రెస్ నిరసన

**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి**
ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టిపిసిసి అధ్యక్షుడు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో బిజెపి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలపై వ్యవహరిస్తున్న మొండి వైఖరికి నిరసనగా భాజపా ఆర్థిక అవకతవకలను, నల్లధనం మూలాన్ని దాచిపెట్టేందుకు ఎస్‌బీఐని ఉపయోగించుకుంటున్నారని కాంగ్రెస్ శ్రేణులు మధిర పట్టణంలోని ఎస్.బి.ఐ బ్యాంక్ ముందు నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మదిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ.. ఎలక్టోరల్ బాండ్ పథకం యొక్క ప్రాథమిక లబ్ధిదారుగా ఉన్న అధికార %దీజ్రీ% సుప్రీం కోర్టు నిర్ణయం తర్వాత ఇబ్బందులను ఎదుర్కొంటుంది. 2017లో పథకం ప్రవేశపెట్టినప్పటి నుండి దాతలు సమర్పించిన బాండ్లను రాజకీయ పార్టీలు సమిష్టిగా 12,000 కోట్లకు పైగా అందుకోగా, %దీజ్రీ% ఒక్కటే 26,566.11 కోట్లను అందుకుంది, ఇది మొత్తం ఎలక్టోరల్ బాండ్లలో 55% ఉన్నాయి. దాతల గురించిన సమాచారం పబ్లిక్‌గా మారిన తర్వాత, ఎంపిక చేసిన కార్పొరేట్‌లతో తన సంబంధాలను బహిర్గతం చేసే అవకాశం గురించి బీజేపీ స్పష్టంగా ఆందోళన చెందుతోంది. సమాచారాన్ని ప్రజలతో పంచుకోవద్దని మోడీ ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై ఒత్తిడి తెచ్చింది. వివరాలను పంచుకోవడానికి జూన్ 30, 2024 వరకు పొడిగించాలని కోరుతూ నిన్న, %హదీ×% సుప్రీంకోర్టులో ఒక దరఖాస్తును దాఖలు చేసింది. ఎస్బిఐ బ్యాంక్ వెంటనే ఎలక్టోరల్ బాండ్లలో బిజెపి ప్రభుత్వం ఎంత దాచింది అనేది ప్రజలకు బహిర్గతం చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధిర మండల ఎంపీపీ మొండెం లలిత మున్సిపాలిటీ కౌన్సిలర్లు కోన ధని కుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, మధిర మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తుమాటి నవీన్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవికుమార్, కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర రెడ్డి, మండల ఐఎన్టీయూసీ అధ్యక్షుడు కోరంపల్లి చంటి, బీసీ సెల్ అధ్యక్షుడు చిలువేరు బుచ్చి రామయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ జహంగీర్, కాంగ్రెస్






పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, బొమ్మ కంటి హరిబాబు,మువ్వా వెంకయ్య బాబు, పత్తేపరపు సంగయ్య, పారుపల్లి విజయ్ కుమార్, నిడమనూరు వంశీకృష్ణ, మొండితోక సుధాకర్, చేకూరి నాగార్జున, టీవీ రెడ్డి, బాలు నాయక్ , మిరియాల కాశీ విశ్వేశ్వరరావు, యన్నం కోటేశ్వరరావు, బిట్రా ఉద్దండయ్య, షేక్ బాజీ, తలుపుల వెంకటేశ్వర్లు, మాగం ప్రసాద్, ఆదిమూలం శ్రీనివాసరావు, కోటా డేవిడ్, మోదుగు బాబు, ఎర్రగుంట రమేష్, మహమ్మద్ రహీం వివిధ హోదా లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు



# జీరో కరెంట్ బిల్లుతో ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

### మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
### కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన మాటూరుపేట మహిళలు

**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చిన కొద్ది రోజులలోనే హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజారంజక పాలన చేస్తుంది. ఆరు గ్యారెంటీలో భాగంగా గృహజ్యోతి పథకం కింద అర్హులైన వారందరికీ 200 యూనిట్లు ఉచిత కరెంటును అందిస్తుంది. అందులో భాగంగా మాటూరుపేట గ్రామంలో జీరో కరెంట్ బిల్లులను లబ్ధిదారులకు విద్యుత్ శాఖ అధికారులు అందించడం జరిగింది. లబ్ధిదారులు జీరో కరెంట్ బిల్లును చూపిస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతేకాకుండా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సిలిండర్ను 500 రూపాయలకు ఇవ్వడం ఆనందకరమైన విషయం. త్వరలో ప్రారంభించబోయే ఇందిరమ్మ గృహాలు కూడా మహిళలల పేరు మీద ఇవ్వడం మంచి పరిణామంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలలు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక,విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షులు రెంటపల్లి శ్రీనివాసరావు, దనిశెట్టి భాస్కరరావు ఉన్నారు.

## మోరంపూడి పుల్లారావు మరణం
# సీపీఎం పార్టీకి తీరని లోటు

➤ నివాళులు అర్పించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**(ఖమ్మం, మార్చి 7, కెరటం న్యూస్)**
సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి టౌన్ పరిధిలో గల సిద్ధారం గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు మోరంపూడి పుల్లారావు అకాల మరణం, పార్టీకి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని మమతా కాలేజీకి పుల్లారావు పార్థివ దేహాన్ని అప్పజెప్పారు. మమతా కాలేజీలో పుల్లారావు మృత దేహాన్ని సందర్శించిన తమ్మినేని పూలమాలతో నివాళులర్పించినారు. అనతరం ఆయన మాట్లడుతూ పుల్లారావు యువజన ఉద్యమంలో 90 దశకంలో కీలక పాత్ర పోషిస్తూ యువజన సంఘం డివిజన్ కార్యదర్శిగా అంచలంచలుగా ఎదిగి సత్తుపల్లి పార్టీ డివిజన్ కార్యదర్శిగా పనిచేశారని గుర్తు చేశారు. నిరంతరం ప్రజల మధ్యనే వుంటూ, పార్టీ అభివృద్ధి కోసం ప్రజా సంఘాల నిర్మాణాన్ని చేపడుతూ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా, అనంతరం కొత్తగూడెం జిల్లా మొదటి మహాసభలో జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికై అనేక ఉద్యమాలు నిర్మించారని, యువజన ఉద్యమంలో, పార్టీ పోరాటాల్లో కీలకపాత్ర పోషిస్తూ అనేక ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొంటూ సాగుభూమి పోరాటాలు నిర్వహించిన చరిత్ర పుల్లారావుకే దక్కుతుందని ఆయన గుర్తు చేశారు. అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ప్రజా సంఘాల నిర్మాణం ఏర్పాటులో మంచి కృషి చేశారని, ఆనాడు ఉన్న భూస్వాములకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల సమయంలో పార్టీపై నిర్బంధాలు ఉన్న కాలంలో అనేక సమస్యలు ఎదుర్కొంటూ, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తిగా కమ్యూనిస్ట్ ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా పుల్లారావు నిలిచి పోతారని కొనియాడారు. మృత దేహన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండిరమేష్, జిల్లా కమిటీ సభ్యులు బండి పద్మ, బండారు రమేష్, నవీన్ రెడ్డి, ఆర్.ప్రకాష్, నందిపాటి మనోహర్, బషీరుద్దీన్, పిన్నింటి రమ్య, మోరంపుడి పాండు, జిల్లా నాయకులు బత్తిని ఉపేందర్, కుటుంబరావు, వై.శ్రీనివాసరావు, వాసిరెడ్డి వీరభద్రం, అఫ్జల్,



సదానందం, పగడాల నాగేశ్వరరావు, బాలాజీ, వర్మ తదితరులు పాల్గొన్నారు.

**మోరంపుడి పుల్లారావు మృతికి సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ, నున్నా సంతాంపం**

మోరంపుడి పుల్లారావు ఆకాల మరణం పార్టీకి, ప్రజాసంఘాలకు ముఖ్యంగా సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలఉద్యమాలకు తీరని లోటని సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు యర్రా శ్రీకాంత్ అన్నారు. పార్థివ దేహాన్ని మమత మెడికల్ కాలేజికి కుటుంబ సభ్యులు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుల్లారావు మృతికి సిపిఎం జిల్లా కమిటి సంతాపం, కుటుంబానికి సానుభూతిని తెలియజేసినట్లు తెలియజేశారు. అలాగే మోరంపుడి పుల్లారావు మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆస్ట్రేలియా నుండి ఫోన్‌లో విచారం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ, ప్రజా ఉద్యమాల్లో నిర్మించడంలో కీలక పాత్ర పోషించిన నాయకుడు, హఠాత్తుగా మరణించటం చాలా బాధాకరమన్నారు. వారికి సిపిఎం ఖమ్మం జిల్లా కమిటి నుండి సంతాపం, సానుభూతిని తెలియజేశారు.




# మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే ఇవ్వాలి

### ఈనెల 11న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి.
### సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు

**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి**
మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే ఇవ్వాలని ఎంఈఓ గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మాట్లాడుతూ మధిర మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వంట వండి వడ్డిస్తున్న కార్మికులకు బిల్లులు వెంటనే ఇవ్వాలని, పెండింగ్ గౌరవ వేతనం వెంటనే ఇవ్వాలని, పాఠశాలలో వంటకు అవసరమైన అన్ని సరుకులు, వంట పాత్రలు, మౌలిక సౌకర్యాలు వెంటనే ఇవ్వాలని ఈనెల 11-03-2024 తేదిన ఖమ్మం కలెక్టరేట్ ముట్టడిని నిర్వహిస్తున్నామని ఈ ధర్నా కార్యక్రమాన్ని మధ్యాహ్నకు భోజన కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మధిర టౌన్ కన్వీనర్ పడకండి మురళి, మండల కన్వీనర్ వడ్రానపు మధు, మధ్యాహ్న భోజన కార్మికులు కృష్ణకుమారి, చిన్ని,రమాదేవి, ఫర్జానా బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ కార్ డ్రైవర్స్ అసోసియేషన్
# నూతన కమిటీ ఎన్నిక



➤ గౌరవాధ్యక్షులుగా తుంబూరు దయాకర్ రెడ్డి

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్ ప్రతినిధి**
ఖమ్మంజిల్లా ఆల్ కార్ డ్రైవర్స్ అసోసియేషన్ 2024-2026కి గాను నూతన కమిటీ ఎన్నికైంది. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుం బూరు దయాకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అసోసియేషన్ వ్యవస్థాపకులు, ముఖ్య సలహాదారులు ఎన్. విజయవర్మ ఆధ్వర్యంలో కమిటీని ఎంపిక చేశారు. ఈ కమిటీలో జిల్లా అధ్యక్షులుగా పి. పాపారావు, జిల్లా ఉపా ధ్యక్షులుగా డి. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిగా ఎన్. జీవనసాగర్, కోశాధికారిగా సాయికృష్ణ, సం యుక్త కార్యదర్శిగా డి. చంటి, జిల్లా సహాయ కార్యదర్శులుగా ఎస్.కె. రసూల్, జి.స్వామి, కార్యవర్గసభ్యులుగా ఎస్.కె. దస్తగిరి, సత్తిబాబు, బాబు, మధు, విజయ్, వీరా, సురేష్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి పొంగులేటి తరఫున అసోసియేషన్ అభివృద్ధికి సహాయసహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు.

# విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు








### ముఖ్య అతిథిగా హాజరైన డా.కావ్యచంద్

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్ ప్రతినిధి**
మహిళా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో మహిళా దినోత్సవ సదస్సును నిర్వహించారు . ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య , ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బయ్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ప్రభుత్వం పురుషులతో పాటుగా మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ డాక్టర్ విజయలక్ష్మి మరియు డాక్టర్ యలమూడి కావ్యచంద్ , అఖిల కంటి ఆసుపత్రి డాక్టర్ సంధ్య మాట్లాడుతూ మహిళల పట్ల వివక్షత కొనసాగుతున్నదని ట్రోలింగ్ పేరుతో మహిళా వేధింపులు అధికమవుతున్నాయని ఆర్థిక అసమానతలు లేకుండా సమాన భాగస్వామ్యం కల్పించినప్పుడే మహిళా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు . మహిళలు చైతన్యవంతంగా ఆలోచించి సమాన అవకాశాల కోసం చట్టసభల ద్వారా కొట్లాడాలని అప్పుడు మాత్రమే మహిళా దినోత్సవానికి సార్ధకత ఉంటుందని అన్నారు . మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ సదస్సులో సీనియర్ మహిళ పెన్షనర్ను సన్మానించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి కె అరుణ భాయ్, లలిత తదితర సీనియర్ ఫ్యామిలీ పెన్షనర్ను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సాంబశివరావు , తాళ్లూరి వేణు , జనార్ధన్, డీకే శర్మ, పట్టణ నాయకులు రాధాకృష్ణ, హనుమంతరావు, వెంకట్ నారాయణ, రమేష్ , బసవరావు, యు.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్‌కు సన్మానం

**కెరటం న్యూస్ గార్ల ప్రతినిధి**
నూతనంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సుధీర్ రాంనాద్ కేకన్ ను టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ను కలిసి శాలువతో సత్కరించి యూనియన్ స్టేట్ డైరీని అందజేశారు. అనంతరం ప్రత్యేకంగా తయారుచేయించిన జ్ఞాపికను ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ కు అందజేశారు. ఈ..సందర్భంగా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ జర్నలిస్ట్ సంఘం నాయకులతో పలు అంశాలపై మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికి తీసి, వెలుగులోకి తెచ్చే జర్నలిస్ట్ ల సమస్యల పరిష్కారం కోసం, శాంతిభద్రల కోసం నిరంతరం పనిచేసే పోలీసులం కలిసి పని చేద్దాం అని, జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం అని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ గారు అన్నారు. ఈ.. కార్యక్రమంలో టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ తోపాటు సంఘం జిల్లాప్రధానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి,ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లాప్రధానకార్యదర్శి ఉప్పల రంగ, జిల్లానాయకులు ఉమ్మగాని మధు, పద్మం మహేష్, అశోక్తదితరులు పాల్గొన్నారు.



# మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం

**కెరటం న్యూస్ హైదరాబాద్,మార్చి7)**
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు బ్యారేజీలను పరిశీలించేందుకు వచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల బృందం రంగంలోకి దిగింది. బుధవారం రాత్రి హనుమకొండలో బస చేసిన అధికారుల బృందం గురువారం ఉదయాన్నే మేడిగడ్డ బ్యారేజీ వద్దకు వెళ్లింది. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం మొదటగా ఎల్ అండ్ టీ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో భేటీ అయ్యారు. ఆ తర్వాత బ్యారేజీ వద్ద ఏడో బ్లాక్‌లో కుంగిపోయిన ప్రాంతం.. దిగువ భాగంలో ఏర్పడిన పగుళ్లను క్షుణ్నంగా పరిశీలించారు. గేట్ల సామర్థ్యం, కుంగుబాటుకు కారణాలపై ఈ కమిటీ పూర్తిగా అధ్యయనం చేయనుంది. ఇక్కడ పరిశీలన పూర్తి అయిన తర్వాత మధ్యాహ్నం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలనూ కమిటీ పరిశీలించనుంది. పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల గడువు విధించింది.